# శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యల కళ్యాణం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



## శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యుల కళ్యాణం

## శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యుల కళ్యాణం ప్రారంభం

ఒకానొక సమయంలో నారదమహర్షి కైలాసపర్వతం మీద స్నేహితులతో కలిసి ముచ్చటించుకున్నటువంటి సుబ్రహ్మణ్యుని సన్నిధానమునకు వెళ్ళారు. లోకములలో తాను చూసిన విశేషములను చెప్పడం మొదలు పెట్టాడు. ఇప్పుడు నారదుడు వల్లీ కళ్యాణం చేయించడానికి వచ్చాడు. ఒక మహర్షి తేజస్సు వలన అయోనిజయై ఒకపిల్ల ఒకతె అరణ్యమునందు పుట్టి ఉండగా ఒక భిల్లు నాయకునికి దొరికింది ఆ పిల్లను తీసుకు వచ్చి ఆయన పెంచుకుంటున్నాడు. ఆ పిల్ల పేరు వల్లి. ఆమె రాశీభూతమయిన సౌందర్యము. అటువంటి వల్లి నీ భార్య కావాలి అది నా కోరిక. ఆ పిల్ల చుట్టూ పాములు ఉంటాయి ఎప్పుడూ. నువ్వు చూసి భయపడకూడదు సుమా! ఎవరు ఆ పిల్ల వొంటిని పట్టిన పాములను చూస్తారో వాళ్ళు ఆ పిల్ల సౌందర్యమును చూసి ఉండలేక పొంగిపోతారు అన్నాడు నారదుడు. ఆ మాటలను విని సుబ్రహ్మణ్యుడు భిల్లపురానికి వెళ్ళాడు. ఆయన వెళ్ళడానికి ముందే నారదుడు ఆ ప్రాంతానికి వెళ్ళాడు. నారదుడికి భిల్లరాజు ఎదురువచ్చాడు. మంచి మంచి పువ్వులు, తేనే, పళ్ళు తీసుకువచ్చి నారదుడికి పెట్టాడు. నారదుడు భిల్లరాజుతో "నీకొక శుభవార్త చెప్తాను. మిమ్మల్ని ఉద్ధరించడానికి పరమేశ్వరుడు ఈ పిల్లను నీకు కూతురుగా పంపాడు. ఈ వల్లీదేవిని పెళ్ళి చేసుకో బోయేవాడు లోకంలో యౌవనంలో ఉన్న ప్రతి స్త్రీ ఎవరిని భర్తగా పొందాలని అనుకుంటుందో, ఎవరు జగదంబ అందాలు పోసుకున్నవాడో, ఎవరు పరమ సౌందర్యరాశియైన శంకరుని తేజమును పొందిన వాడో, ఎవడు

గొప్ప వీరుడో, ఎవడు మహాజ్ఞానియో ఎవడు దేవసేనాధిపతియో అటువంటి వాడు నీకు అల్లుడు కాబోతున్నాడు నీ అదృష్టమే అదృష్టం అన్నాడు. భిల్లురాజు నారదుని మాటలు విని చాలా పొంగిపోయాడు

కుమారస్వామి వనంలోకి ప్రవేశించి వల్లీ దేవి వంక చూసి బహుశః బ్రహ్మ తన సృష్టి శక్తిలోని సౌందర్యమునంతటిని ఒకచోట రాశీభూతం చేసి ప్రాణప్రతిష్ఠ చేస్తే ఆమె ఈ వల్లి అయి ఉంటుంది ఈ పిల్లతో ఒకసారి మాట్లాడాలి అని అనుకున్నాడు. 'లతాంగీ నన్ను చేపట్టవా?" అని అడిగాడు. ఆవిడ ఈయన వంక చూసి 'అబ్బో ఈతడు ఎంత అందగాడో' అనుకుని నారదుడు మా ఇంటికి వచ్చినప్పుడు నాకు సుబ్రహ్మణ్యడితో వివాహం అవుతుందని చెప్పాడు.

ఈ పిల్లవాడు అందగాడు కావచ్చు కానీ నా మనస్సు నందు పాపపంకిలమయిన భావం కలుగరాదు. నేను సుబ్రహ్మణ్యడికి చెందినదానను. పార్వతీ పరమేశ్వరుల కుమారుడు అయి ఉంటె నా రొట్టె విరిగి నేతిలో పడినట్లే కదా అనుకుని 'ఇంట్లో పెద్దవాళ్ళు ఉన్నారు. ఏదయినా అడగవలసి వస్తే మా తల్లిదండ్రులను అడగాలి. అయినా కుమారస్వామి నాకు భర్త అవుతాడని నారదుడు చెప్పాడు. అందువల్ల నా మనస్సు ఆయనకు అర్పించబడింది అని చెప్పింది. ఆమె అలా చెప్పగానే మహానుభావుడు సుబ్రహ్మణ్యడు ఒక్కసారి తన నిజరూపమును చూపించాడు. ఆ తల్లి పొంగిపోయింది. ఇంతలో తండ్రి వచ్చి ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు. ఇంటికి వెళ్ళిన తర్వాత ఆ పిల్ల మనస్సులో కుంది ఏడుస్తోంది. అయ్యో ఎక్కడి మహానుభావుడు. నేను ఒక్కమాట నోరు తెరిచి చెప్పలేదు. అని. చెలికత్తె

ఎందుకమ్మా బెంగ పెట్టుకుంటావు. ఒక ఆకుమీద ఉత్తరం రాసి ఇవ్వు. నేను పట్టుకుని వెళ్లి ఆయనకు ఇస్తాను అంది.

అక్కడ సుబ్రహ్మణ్యుడు పుష్పవాటిక యందు ఒక సరోవరం ఒడ్డున కూర్చుని ఉన్నాడు. చెలికత్తె వెళ్లి పత్రం చూపించింది. ఆయన చదివి వల్లీదేవి దగ్గరకు వెళదా అన్నాడు. అపుడు చెలికత్తె అలా వద్దు నేను పిల్లను తీసుకువస్తాను అని చెప్పి వెళ్లి వల్లీదేవిని తీసుకువచ్చింది. వారిద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఈలోగా తెల్లారిపోయింది. పిల్ల కనపడలేదని అందరూ వెతుకుతూ సరోవరం ఒడ్డు దగ్గరకు రాగా ఇద్దరూ కనపడ్డారు. భిల్ల నాయకుడికి ఆ యువకుడు సుబ్రహ్మణ్యుడు అని తెలియదు. సుబ్రహ్మణ్యుడు కూడా వేటగాని వేషంలో ఉన్నాడు. వెంటనే ఆగ్రహంతో తన పరివారంతో ఆయన మీద బాణములు ప్రయోగించాడు. సుబ్రహ్మణ్యుడు పేలగా నవ్వుతూ వాటినన్నింటినీ స్వీకరించి వల్లీదేవి వంక చూసి వారి మీద సమ్మోహనాస్త్రమును ప్రయోగించాడు. అందరూ క్రిందపడి స్పృహతప్పిపోయారు. అప్పుడు వల్లీ దేవి తన వాళ్ళందరూ పడిపోయారని ఏడ్చింది. అపుడు స్వామివారు అనుగ్రహించేసరికి మరల వారందరికీ స్పృహ వచ్చి లేచారు. వారు లేచి చూసేసరికి శూలం పట్టుకుని నెమలివాహనం మీద వల్లీదేవితో కలిసి కూర్చున్న సుబ్రహ్మణ్యుడు సాక్షాత్కరించాడు. ఆ భిల్లులందరూ నేలమీద పది సుబ్రహ్మణ్యుడికి సాష్టాంగ నమస్కారం చేసి పొంగిపోయారు.

నారదుడు దేవసేనతో పార్వతీ పరమేశ్వరులతో అక్కడకు వచ్చాడు. నేనెంత భాగ్యవంతురాలినో కదా అనుకుని వల్లీదేవి పార్వతీ పరమేశ్వరులకు

నమస్కరించింది. అపుడు సంతోషంగా పార్వతీ పరమేశ్వరులతో దేవసేనతో కలిసి ఏ అరమరికలూ లేకుండా ఆనాటి నుండి ఈనాటి వరకు భక్తుల కోర్కెలు అనుగ్రహించడానికి సుబ్రహ్మణ్య స్వామి వారు తిరుత్తణియందు వెలసి ఉన్నారు. సుబ్రహ్మణ్యుడిని పూజిస్తే మన పాపములన్నీ దగ్ధమయిపోతాయి. వంశాభివృద్ధి జరుగుతుంది.

శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి పరిపూర్ణ కరుణా కటాక్ష సిద్ధిరస్తు

**సంతానం కోరుకునేవారు షష్ఠిదేవిని పూజించాలి**

సంతానం కోరుకునేవారు షష్ఠీదేవిని వ్రత విధానమున పూజించిన, సంతానం తప్పక కలుగుతుంది.

షష్ఠీ దేవి ప్రకృతి దేవి యొక్క షష్టాంశ (ఆరవ కళ) వల్ల అవతరించినది గనుక ఆమెకు షష్ఠీదేవి అని పేరు వచ్చినది. ఈమె కుమార స్వామికి ప్రియురాలు. పిల్లలకి తరుచుగా అనారోగ్యాలు కలుగుతున్నా, ఆపదలు వస్తున్నా, బాలారిష్టాలు ఉన్నా షష్ఠిదేవి కధ విన్నా, చదివినా, వ్రాసినా షష్ఠిదేవి శిశువులకు పక్కనే ఉండి వారి ఆయువుని అభివృద్ధి చేస్తుంది. గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా షష్ఠిదేవి స్తోత్రం చదివితే పుత్రపౌత్రాభివృద్ధి కలుగుతుంది. సంతానం లేనివారు షష్ఠిదేవి స్తోత్రం శ్రద్ధగా పఠిస్తే దీర్ఘాయుష్మంతులు అయిన సంతానం పొందుతారు. సృష్టిలోని చిన్నపిల్లందరికీ జన్మనిచ్చిన తల్లిగాక, కష్టాల నుంచి గట్టెక్కించి కాపాడే

మరో తల్లి ఉంది. ఆమే షష్ఠీదేవి. ఈ దేవతకు సంబంధించిన కథ దేవీభాగవతం తొమ్మిదో స్కంధంలో వివరంగా కనిపిస్తుంది.

ప్రతి భాద్రపద శుక్లచవితిని వినాయక చవితి పండుగగా ఎలా చేసుకుంటారో అలాగే ప్రతి భాద్రపద శుక్లషష్ఠిని షష్ఠీదేవి పండుగగా కూడా జరుపుకోవటం సంప్రదాయంగా వస్తోంది. అలానే ప్రతి మాసంలోనూ శుక్ల పక్షంలోనూ, కృష్ణ పక్షంలోనూ వచ్చే రెండు షష్ఠి తిథులలోనూ షష్ఠిదేవిని ఆరాధిస్తే ఎంతటి గొడ్రాళ్ళకైనా తప్పక సంతాన ప్రాప్తి కలుగుతుందని ప్రతీతి. ఈ దేవత చరిత్రే ఓ విచిత్రంగా, గొప్పగా కనిపిస్తుంది. ప్రకృతి మాతలో ఆరో అంశగా ఈమె అవతరించిన కారణంగా షష్ఠీదేవి అని పేరు వచ్చింది. బ్రహ్మ మానస పుత్రిక అయిన ఈ దేవత యుద్ధసమయాలలో దేవతల సేనను నిరంతరం కాపాడుతూ దేవతలకు విజయం చేకూర్చిపెడుతున్న కారణంగా దేవసేన అని పేరు వచ్చింది. ఈ దేవసేన కుమారస్వామిని వివాహమాడింది. బాలబాలికలకు మంచి ఆయువును ఇచ్చి పెంపుడు తల్లిలా రక్షిస్తూ యోగమాయా రూపంలో పురిటింట్లో పిల్ల పక్కనే ఉంటుంది. పిల్లలకు అనారోగ్యం కలిగినప్పుడు తల్లిదండ్రులు ఈ దేవతను ఆర్తితో స్తుతిస్తే వారికి ఆరోగ్యాన్ని చేకూర్చిపెడుతుంది. దీనికి సంబంధించిన పూర్వకథ నొకదానిని కూడా దేవీభాగవతం పేర్కొంటోంది.

పూర్వం స్వాయంభువ మనువుకు ప్రియవ్రతుడు అనే ఓ కుమారుడు జన్మించాడు. ప్రియవ్రతుడు పెరిగి పెద్దయ్యాడు కానీ ఎందుకో ఆయనకు వివాహం మీదకు మనస్సు పోలేదు. నిరంతరం తపస్సుకే తన జీవితాన్ని అంకితం చేశాడు. అయితే బ్రహ్మదేవుడు కలగజేసుకొని గృహస్థాశ్రమ ప్రాముఖ్యాన్ని వివరించి

ప్రియవ్రతుడికి మాలినీదేవి అనే కన్యతో వివాహం జరిపించాడు. అయితే ఆ దంపతులకు ఎంత కాలానికీ సంతానం కలగలేదు. ఈ పరిస్థితిని గమనించిన కశ్యప ప్రజాపతి వచ్చి పుత్రకామేష్ఠి యాగాన్ని ప్రియవ్రతుడి చేత చేయించాడు. ఆ తర్వాత మాలినీదేవి గర్భవతి అయింది. ఓ శుభముహూర్తాన పండంటి బిడ్డను ప్రసవించింది. కానీ ఆ శిశువు మృతశిశువు. దాంతో ఆ దంపతులు ఎంతో శోకించారు. ప్రియవ్రతుడు మృతశిశువును తీసుకొని అడవిలోకి వెళ్ళాడు. అక్కడ అతడికి దుఃఖం ఆగలేదు. దారుణంగా విలపించాడు. అలా విలపిస్తూనే కూర్చున్నాడు తప్ప శిశువును ఖననం చేయటానికి పూనుకోలేదు. ఇంతలో ఓ దివ్యవిమానం అక్కడకు వచ్చి ఆగింది. ఆ విమానంలో నుంచి తెల్లని వస్త్రాలతో, పుష్పమాలికలతో ప్రకాశిస్తున్న ఒక దేవత అక్కడ నిలిచింది.

ప్రియవ్రతుడు ఆమెను చూసి శిశువును కిందకు దించి లేచి నిలుచొని నమ్కరించాడు. ఆమె ఎవరో? తన దగ్గరకు ఎందుకు రావల్సి వచ్చిందో చెప్పమన్నాడు. అప్పుడు ఆ దేవి తన విషయాలన్నింటినీ చెప్పింది. తాను ఆదిపరాశక్తిలోని ఆరో అంశనని, తన వివరాలన్నీ చెప్పి శిశువును చేతిలోకి తీసుకొని ఒళ్ళు నిమిరింది. ఆ బాలుడు కిలకిలా నవ్వుతూ జీవం పోసుకొని కళకళలాడాడు. పునరుజ్జీవితుడైన ఆ పిల్లవాడు సూరతుడు అనే పేరుతో పెరిగి పెద్దవాడవుతాడని, ఎంతో యోగ్యుడుగా ఉంటాడని గొప్ప కీర్తిని కూడా గడిస్తాడని షష్ఠీదేవి ప్రియవ్రతుడికి చెప్పింది. తాను పసిపిల్లలను నిరంతరం రక్షిస్తూ ఉంటానని, అయితే కర్మవిపాకం బలీయమని పూర్వజన్మలో చేసుకున్న కర్మం ప్రకారం ఎవరికైనా కష్టాలు రాసుంటే వాటిని తప్పించటం అంత సులభసాధ్యం

కాదంది. అలాకాక మరి ఏ ఇతర కారణాంతరాల వల్లైనా శిశువులకు కష్టాలు కలిగితే వాటిని తాను తొలగిస్తానని చెప్పింది.

ప్రియవ్రతుడు రోదిస్తూ ఉండటాన్ని పక్కనే మృతశిశువు ఉండటాన్ని చూసి తాను తట్టుకోలేక అలా వచ్చానని చెప్పింది. ఆ తర్వాత ఆమె ప్రియవ్రతుడికి తిరిగి బతికిన బిడ్డను ఇచ్చి అంతర్థానమైంది. అప్పటినుంచి ప్రతినెల శుక్లషష్ఠినాడు అందులోను భాద్రపద శుక్లషష్ఠినాడు ప్రియవ్రతుడు షష్ఠీదేవికి పూజలు జరిపించటం ప్రారంభించాడు. పురిటిళ్ళల్లో ఆరో రోజున, పదకొండో రోజున, అన్నప్రాసన రోజున ప్రతి శుభకార్యం సందర్భంలోను షష్ఠీదేవి పూజలుచేయటం ఆనాటినుంచే మొదలైంది. సాలగ్రామంలోనో, మంగళకలశంలోనో, వటవృక్షం మూలనో షష్ఠీదేవిని ఆవాహన చేసి పూజలు జరిపిస్తారు. పుష్పాలతోను, షోడశ ఉపచారాలతోను పూజచేసి నైవేద్యం పెడతారు. ఇలా పూజలు చేసినవారి ఇంట శిశువులకు మంచి ఆరోగ్యమే కాక పెద్దవారికి కూడా సుఖభోగాలు ప్రాప్తిస్తుంటాయన్నది నమ్మకం. పిల్లలను తల్లిలా కాపాడే ఓ ప్రత్యేక దేవత షష్ఠీదేవి గురించి దేవీభాగవతం వివరిస్తోంది.

**శ్రీ సుబ్రహ్మణ్య కుటుంబిన్యై నమః**

**ధ్యానం :**

శ్రీమన్మాతరమంబికాం విధి మనోజాతాం సదాభీష్టదాం

స్కందేష్టాం చ జగత్ప్రసూం విజయదాం సత్పుత్ర సౌభాగ్యదాం .

సద్రత్నాభరణాన్వితాం సకరుణాం శుభ్రాం శుభాం సుప్రభాం

షష్ఠాంశాం ప్రకృతేః పరాం భగవతీం శ్రీదేవసేనాం భజే ..

షష్ఠాంశాం ప్రకృతేః శుద్ధాం సుప్రతిష్ఠాం చ సువ్రతాం .

సుపుత్రదాం చ శుభదాం దయారూపాం జగత్ప్రసూం ..

శ్వేతచంపక వర్ణాభాం రక్తభూషణ భూషితాం .

పవిత్రరూపాం పరమాం దేవసేనాం పరాంభజే ..

## అథ శ్రీషష్ఠీదేవి స్తోత్రం

స్తోత్రం శృణు మునిశ్రేష్ఠ సర్వకామశుభావహం .

వాంఛాప్రదం చ సర్వేషాం గూఢం వేదే చ నారద ..

## ప్రియవ్రత ఉవాచ:

నమో దేవ్యై మహాదేవ్యై సిద్ధ్యై శాంత్యై నమో నమః .

శుభాయై దేవసేనాయై షష్ఠీదేవ్యై నమో నమః .. 1..

వరదాయై  పుత్రదాయై ధనదాయై నమో నమః .

సుఖదాయై మోక్షదాయై చ షష్ఠీదేవ్యై నమో నమః .. 2..

సృష్ట్యై షష్ఠాంశరూపాయై సిద్ధాయై చ నమో నమః .  (var  శక్తిషష్ఠీస్వరూపాయై)

మాయాయై సిద్ధయోగిన్యై షష్ఠీదేవ్యై నమో నమః .. 3..

పరాయై పారదాయై చ షష్ఠీదేవ్యై నమో నమః .

సారాయై సారదాయై చ పరాయై సర్వకర్మణాం .. 4..

బాలాధిష్ఠాతృదేవ్యై చ షష్ఠీదేవ్యై నమో నమః .

కల్యాణదాయై కల్యాణ్యై ఫలదాయై చ కర్మణాం .. 5..

ప్రత్యక్షాయై చ భక్తానాం షష్ఠీదేవ్యై నమో నమః .

పూజ్యాయై స్కందకాంతాయై సర్వేషాం సర్వకర్మసు .. 6..

దేవరక్షణకారిణ్యై షష్ఠీదేవ్యై నమో నమః .

శుద్ధసత్త్వస్వరూపాయై వందితాయై నృణాం సదా .. 7..

హింసాక్రోధవర్జితాయై షష్ఠీదేవ్యై నమో నమః .

ధనం దేహి ప్రియాం దేహి పుత్రం దేహి సురేశ్వరి .. 8..

ధర్మం దేహి యశో దేహి షష్ఠీదేవ్యై నమో నమః .

భూమిం దేహి ప్రజాం దేహి దేహి విద్యాం సుపూజితే .. 9..

కల్యాణం చ జయం దేహి షష్ఠీదేవ్యై నమో నమః .

**.. ఫలశ్రుతి ..**

ఇతి దేవీం చ సంస్తూయ లేభే పుత్రం ప్రియవ్రతః .. 10..

యశస్వినం చ రాజేంద్రం షష్ఠీదేవీప్రసాదతః .

షష్ఠీస్తోత్రమిదం బ్రహ్మన్యః శృణోతి చ వత్సరం.. 11.

అపుత్రో లభతే పుత్రం వరం సుచిరజీవినం .

వర్షమేకం చ యా భక్త్యా సంయత్తేదం శృణోతి చ .. 12..

సర్వపాపాద్వినిర్ముక్తా మహావంధ్యా ప్రసూయతే .

వీరపుత్రం చ గుణినం విద్యావంతం యశస్వినం .. 13..

సుచిరాయుష్మంతమేవ షష్ఠీమాతృప్రసాదతః .

కాకవంధ్యా చ యా నారీ మృతాపత్యా చ యా భవేత్ .. 14..

వర్షం శృత్వా లభేత్పుత్రం షష్ఠీదేవీప్రసాదతః .

రోగయుక్తే చ బాలే చ పితా మాతా శృణోతి చేత్ .. 15..

మాసం చ ముచ్యతే బాలః షష్ఠీదేవీ ప్రసాదతః .

.. ఇతి శ్రీబ్రహ్మవైవర్తే మహాపురాణే ఇతిఖండే నారదనారాయణసంవాదే

షష్ఠ్యుపాఖ్యానే శ్రీషష్ఠీదేవిస్తోత్రం సంపూర్ణం ..

## సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామిని ఎలా ఆరాధించాలి ?

సుబ్రహ్మణ్య షష్ఠి రోజున సుబ్రహ్మణ్యుని ఆరాధించడం మనకు తెలిసిన విషయమే, మరి ఎలా ఆరాధించాలి, ఏ నియమాలు పాటించాలి, ఏ స్తోత్రాలు పఠించాలి వంటివి క్షుణ్ణంగా తెలుసుకుందాం ...

ముందు రోజే తెలుసుకోవడం వలన ఏ హడావుడి లేకుండా, ఏకాగ్రతతో భక్తిశ్రద్ధలతో తృప్తిగా పూజించుకోవచ్చు అనే ఉద్దేశ్యంతో పూజా విధానాలు, స్తోత్రాలు, కథలు పోస్ట్ చేస్తున్నాను. కొందరికైనా ఇవి ఉపయోగపడితే అంతే చాలు. ఇక్కడ నేను చెప్పినవి మేము పాటిస్తూ వస్తున్నవి.

ప్రతి షష్ఠి తిథి రోజున షష్ఠి దేవిని ఆరాధించడం వలన సుబ్రహ్మణ్యుని విశేష అనుగ్రహం కలుగుతుంది. షష్ఠి దేవి యొక్క వాహనం " పిల్లి ". షష్ఠి తిథి నాడు పిల్లికి పాలు పోసి, ఆ పాలు గనుక పిల్లి త్రాగితే షష్ఠి దేవి అనుగ్రహం కలిగినట్లే. షష్ఠి దేవి స్తోత్రం భక్తిశ్రద్ధలతో పఠించాలి.

సుబ్రహ్మణ్య స్తోత్రాలైన భుజంగ స్తోత్రం, సుబ్రహ్మణ్య కవచం, ద్వాదశ నామ స్తోత్రాలు పఠించాలి. ముఖ్యంగా స్కంద షష్ఠి కవచం అనే మహా మహిమాన్వితమైన స్తోత్రం పఠిస్తే చాలా మంచిది. తమిళనాడులో స్కంద షష్ఠి కవచం బహు ప్రాచుర్యంలో ఉన్నది. మన తెలుగు రాష్ట్రాల్లో అంతగా తెలియదు. కనుక మీరు స్కంద షష్ఠి కవచం వినండి. స్కంద షష్ఠి కవచం వినినా సుబ్రహ్మణ్యుని అనుగ్రహం తప్పక కలుగుతుంది.

ఇక స్కందోత్పత్తి శ్లోకాలు, కుమార సంభవం, వల్లీ కళ్యాణం, దేవసేనా కళ్యాణం తప్పక పఠించాలి. ఇవన్నీ ఒక్కొక్క పోస్ట్ లో ఈరోజే పెడతాను, పఠించాలి అనుకునే వారు రేపు పఠించవచ్చు.

ఇక సుబ్రహ్మణ్యుని ఆలయానికి వెళ్ళి పిండి దీపారాధన చేయాలి. చలిమిడి పిండితో ( బియ్యపు పిండి, బెల్లము కలిసిన మిశ్రమం ). ఆవు నేతితో దీపారాధన చేయాలి. ఇంట్లో కూడా పిండి దీపాలు వెలిగించాలి. బ్రహ్మణునికి (ముఖ్యంగా బ్రహ్మచారి అయిన బ్రాహ్మణ వటువుకి) మధ్యాహ్నం షడ్రసోపేతమైన పిండి వంటలు స్వయంగా చేసి తృప్తిగా వడ్డించి, శక్తి మేరకు దక్షిణ తాంబూలాలు, ఎర్రని పంచ, పైపంచ ఇచ్చి, అతడే సుబ్రహ్మణ్యుని స్వరూపంగా భావించి ఆశీర్వచనం తీసుకోవాలి. శక్తిని, శరీర సహకారాన్ని బట్టి ఉపవసించి, సాయంత్రం నక్షత్ర దర్శనానంతరం భుజించాలి.

**సుబ్రహ్మణ్య షష్ఠి రోజు చేయవలసినవి**

సుబ్రహ్మణ్య షోడశోపచార పూజ

పిండి దీపారాధన

సుబ్రహ్మణ్య స్తోత్ర పఠనం

సుబ్రహ్మణ్యుని చరిత్ర పఠనం ( స్కందోత్పత్తి, వల్లీ కళ్యాణం, దేవసేనా కళ్యాణం)

ఉపవాసం

సుబ్రహ్మణ్య ఆలయ దర్శనం

బ్రహ్మణునికి భోజనం, దక్షిణ తాంబూలాలు, వస్త్ర దానం ( ఒకవేళ భోజనానికి బ్రాహ్మణుడు దొరకని పక్షంలో స్వయంపాకం వస్తువులు ఇవ్వవచ్చు )

## శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి షోడశోపచార పూజ

**పూజా విధానం:**

### గణపతి ధ్యానం:

శ్లో||శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం|

ప్రసన్న వదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే||

శ్లో||ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రక్షసాం |

దేవతాపూజనార్థాయ ఘంటానాదం కరోమ్యహం ||

(అని ఘంటవాయించాలి)

### ఆచమనం:

(పై మూడు మంత్రములతో పంచపాత్రలోని నీటిని ఉద్ధరిణితో చేతిలో పోసుకొని తీసుకోవాలి)

ఓం కేశవాయ స్వాహా

ఓం నారాయణాయ స్వాహా

ఓం మాధవాయ స్వాహా

ఓం గోవిందాయ నమః

ఓం విష్ణవే నమః

ఓం మధుసూదనాయ నమః

ఓం త్రివిక్రమాయ నమః

ఓం వామనాయ నమః

ఓం శ్రీధరాయ నమః

ఓం హృషికేశాయ నమః

ఓం పద్మనాభాయ నమః

ఓం దామోదరాయ నమః

ఓం సంకర్షణాయ నమః

ఓం వాసుదేవాయ నమః

ఓం ప్రద్యుమ్నాయ నమః

ఓం అనిరుద్ధాయ నమః

ఓం పురుషోత్తమాయ నమః

ఓం అధోక్షజాయ నమః

ఓం నారసింహాయ నమః

ఓం అచ్యుతాయ నమః

ఓం జనార్ధనాయ నమః

ఓం ఉపేంద్రాయ నమః

ఓం హరయే నమః

ఓం శ్రీకృష్ణాయ నమః

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

(అని పై నామములను స్మరింపవలెను)

శ్లో|| ఉత్తిష్ఠంతుభూతపిశాచాః ఏతే భూమిభారకాః |

ఏతేషామవిరోధేన బ్రహ్మకర్మ సమారభే ||

పై శ్లోకము చదివి అక్షతలు వాసన చూచి తమ ఎడమవైపున వేసుకొనవలయును.

ఆ తరువాత కుడిచేతితో ముక్కు పట్టుకొని ఈ క్రింది విధముగా ప్రాణాయామము చేయవలయును.

**ప్రాణాయామము:**

**ఓం భూః, ఓంభువ, ఓగ్ ంసువః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓగ్ ంసత్యం, ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్, ఓం అపోజ్యోతి రసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం ||**

**పై మంత్రముతో 3 మార్లు ప్రాణాయామము చేసి సంకల్పం చేయాలి.**

**సంకల్పం:**

**ఓం మమ ఉపాత్తదురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభనే ముహూర్తే అద్య బ్రహ్మణ ద్వితీయ పరార్థే శ్వేతవరాహ కల్పే వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే అస్మిన్(ఆయా ప్రంతాలకు మార్చుకోవాలి) వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్ఠి సంవత్సరానాం మధ్యే శ్రీ .......(సంవత్సరం పేరు చెప్పాలి) నామసంవత్సరే, ...ఆయనే, .....ఋతౌ, .....మాసే, ....పక్షే , ....తిధౌ, ......వాసర యుక్తాయాం, శుభనక్షత్ర, శుభయోగ, శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభతిదౌ, శ్రీ మాన్ .....(పేరు చెప్పాలి), గోత్రః .........(గోత్రం పేరు చెప్పాలి) నామధేయస్య, ధర్మపత్నీ సమేతస్య అస్మాకం సహకుటుంబానాం క్షేమ, స్థైర్య, విజయ ఆయురారోగ్య ఐశ్వర్యాభివృధ్యర్థం, ధర్మార్థ కామమోక్ష చతుర్విద ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవతా ముద్దిస్య | శ్రీ వల్లీదేవసేన**

సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ప్రీత్యర్థం ధానా వాహనాది శోడశోపచార పూజాం కరిష్యే|

అని మూడుమార్లు నీటిని ఆకులోగాని, పళ్ళెములోగాని వదలవలయును. ఆ పిదప గంటను ఈ శ్లోకము చదువుచు వాయించవలయును.

**గణపతి పూజ:**

శ్లో||వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ |

నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ||

**కలశ పూజ:**

(కలశమునకు మూడువైపుల గంధము పెట్టి, కుంకుమ పెట్టి కలశం నీటిలో అక్షతలు, గంధము, పుష్పము ఉంచి చేతితో మూసి ఈ క్రింది శ్లోకములతో అభిమంత్రణ చేయవలయును)

కలశం గంధపుష్పాక్షతైరభ్యర్చ్య |

కలశోపరి హస్తంనిధాయ ||

కలశస్య ముఖే విష్ణు: కంఠే రుద్ర స్సమాశ్రిత:|

మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృ గణా: స్మృతా:||

కుక్షౌతు సాగరా: సరేసప్త దీపా వసుంధరా |

ఋగ్వేదో విధ యజుర్వేద: సామవేదో హ్యధర్వణ:||

అంగైశ్చ సహితా: సర్వే కలశాంబు సమాశ్రితా:|

గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి |

నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు ||

సర్వేసముద్రాః సరితః తీర్థాని చ హ్రదాః నదాః |

ఆయంతు దేవ పూజార్థం దురితక్షయ కారకా:||

కలశొదకేన పూజా ద్రవ్యాణి దేవమండపఆత్మానంచ సంప్రొక్ష్య

(కలశోదకము పుష్పముతో దేవునిపైన, తమపైన పూజద్రవ్యములపైన, తన మీద చల్లవలెను)

**ప్రాణప్రతిష్ట:**

(నీటిని చల్లుతూ క్రింది మంత్రమును ముమ్మారు చెప్పవలెను)

ఓం ప్రాణస్య శివః ప్రాణేశ స్వాహ ||

**ధ్యానం:**

శక్తిహస్తం విరూపాక్షం షడాననం దారుణం |

రిపోఘ్నం భావయే కుక్కుట ధ్వజం ||

షడాననం కుంకుమ రక్తవర్ణం మహామతిం దివ్యమయూరవాహనం |

రుద్రస్యసూనుం సురసైన్యనాథం గుహం సదాహం శరణం ప్రపద్యే ||

కుమారేశసూనో గుహస్కంద సేనాపతే శక్తిపాణే మయూరాధిరూఢ |

పులిందాత్మజాకాంత భక్తార్తి హారిన్ ప్రభో తారకారే సదారక్షమాంత్వం ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ధ్యాయామి

**ఆవాహనం:**

ఆవాహయామి దేవేశ సిద్ధగంధర్వ సేవిత |

తారకాసుర సంహారిన్ రక్షోబల విమర్ధన ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ఆవాహయామి

**రత్నసింహాసనం:**

ఉమాసుతశ్శక్తిధరః కౌమార క్రౌంచదారణ |

ఇదం సింహాసనం దివ్యం గృహ్యతాం శంకరాత్మజ ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః నవరత్న ఖచిత సింహాసనం సమర్పయామి

(పుష్పము ఉంచవలయును)

**పాద్యం:**

గంగాజల సమాయుక్తం సుగంధం గంధసంయుతం |

పాద్యం చ ప్రతిగృహ్ణాతు పార్వతీ ప్రియనందన ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః పాదయోః పాద్యం సమర్పయామి

(కలశంలోని నీటిని అమ్మవారి పాదములు కడిగినట్టుగా భావించి చల్లవలయును)

**అర్ఘ్యం:**

స్కందో గుహష్షణ్ముఖశ్చ ఫాలనేత్ర సుతః ప్రభుః |

అర్ఘ్యం దాస్యామితే దేవ శిఖివాహో ద్విషద్భుజః ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః అర్ఘ్యం సమర్పయామి

(మరల ఉదకము చల్లవలయును)

**ఆచమనీయం:**

దేవసేనాపతిః ప్రాజ్ఞః కృపాళుర్భక్త వత్సలః |

గంగాసుతశ్శరోద్భూతః ఆచమనం ప్రతిగృహ్యతాం ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ముఖే ఆచమనీయం సమర్పయామి

(మరల నీళ్లు చల్లవలయును)

**పంచామృత స్నానం:**

పయోదధి సమాయుక్తం ఘృత శర్కరయా యుతం |

పంచామృత స్నానమిదం గృహాణ సురపూజిత ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః పంచామృత స్నానం సమర్పయామి

(పంచామృతములు పుష్పముతో చల్లవలెను)

**శుద్ధోదకస్నానం:**

నదీనాం దేవ సర్వాసాం అనీతం నిర్మలోదకం |

స్నాపయామి మహాసేన తథా శాంతిం కురుష్వమే ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః శుద్ధోదకస్నానం సమర్పయామి

(మంచినీటిని పుష్పముతో చల్లవలయును)

**వస్త్రం:**

మహాసేనః కార్తికేయః మహాశక్తిధరో గుహః |

వస్త్రం సూక్ష్మం గృహాణత్వం సర్వదేవ నమస్కృతః ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః వస్త్రయుగ్మం సమర్పయామి

(వస్త్రము లేదా అక్షతలు, పుష్పము ఉంచవలెను)

**యజ్ఞోపవీతం:**

నానారత్న స్వర్ణయుతం త్రివృం బ్రహ్మసూత్రకం |

ఉపవీతం మయాదత్తం సంగృహాణ సురేశ్వర ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః యజ్ఞోపవీతం సమర్పయామి

**గంధం:**

శ్రీగంధాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితం |

విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతి గృహ్యతాం ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః దివ్యశ్రీ గంధం సమర్పయామి

(గంధము పుష్పములో అద్ది సమర్పించవలెను)

**అక్షతాన్:**

శాలీయాంశ్చంద్రవర్ణాభాన్ హరిద్రా మిశ్రితాం స్తథా |

అక్షతాంస్తవ దాస్యేవాహం గృహాణ సురవందిత ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః అక్షతాన్ సమర్పయామి

(అక్షంతలు చల్లాలి)

**ఆభరణం:**

భూషణాని విచిత్రాణి హేమరత్న మయానిచ |

గృహాణ భువనాధార భుక్తిముక్తి ఫలప్రద ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ఆభరణి సమర్పయామి

(పూలు, అక్షంతలు చల్లాలి)

**పుష్పము:**

సుగంధీని సుపుష్పాణి కేతకీ చంపకాని చ |

మయాహృతాని పూజార్థం కృపయా ప్రతిహృహ్యతాం ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః పుష్పాణి సమర్పయామి

(పూలు వేయాలి)

**అథాంగ పూజ:**

ఓం జ్ఞానశక్త్యాత్మకాయ నమః పాదౌ పూజయామి

ఓం స్కందాయే నమః గుల్ఫౌ పూజయామి

ఓం అగ్నిగర్భాయ నమః జానునీ పూజయామి

ఓం బాహులేయాయ నమః జంఘే పూజయామి

ఓం గాంగేయ నమః ఊరూ పూజయామి

ఓం శరణోద్భవాయ నమః కటిం పూజయామి

ఓం కార్తికేయాయ నమః ఉదరం పూజయామి

ఓం కుమారాయ నమః నాభిం పూజయామి

ఓం షణ్ముఖాయ నమః హృదయం పూజయామి

ఓం తారకారి నమః కంఠం పూజయామి

ఓం సేనానీ నమః వక్త్రం పూజయామి

ఓం గుహాయా నమః నేత్రం పూజయామి

ఓం బ్రహ్మచారిణే నమః కలౌ పూజయామి

ఓం శివతేజాయ నమః లలాటం పూజయామి

ఓం క్రౌంచాధారీ నమః శిరః పూజయామి

ఓం శిఖివాహనాయ నమః సర్వాణ్యంగాని పూజయామి

**శ్రీ సుబ్రహ్మణ్య అష్టోత్తరశతనామ పూజ**

(ఒకొక్క నామానికి పసుపు/కుంకుమ/పూలు వేస్తూ చదవాలి)

## శ్రీ సుబ్రమణ్య స్తోత్రం

**ధూపం:**

దశాంగం గుగ్గులోపేతం సుగధం చ మనోహరం |

ధూపం గృహాణ దేవేశ సర్వదేవ నమస్కృతః ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ధూపం సమర్పయామి

(అగరవత్తులు వెలిగించండి)

**దీపం:**

అజ్ఞాన నాశనం దేవ జ్ఞానసిద్ధిప్రభో భవ |

సకర్పూరాజ్య దీపం చ గృహాణ సురసేవిత ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః సాక్షాత్ దీపం దర్శయామి

(దీపం చూపించాలి)

**నైవేద్యం:**

భక్ష్యైర్భోజ్యై స్సచోష్యైశ్చ పరమాన్నం స శర్కరం |

నైవేద్యం గృహ్యతాం దేవీ శంభుపుత్ర నమోస్తుతే ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః నైవేద్యం సమర్పయామి

(పిండి వంటలపై నీళ్ళు చల్లాలి)

**తాంబూలం:**

తాంబూలంచస కర్పూరం నాగవల్లీ దళైర్యుతం |

ఊగీఫల సమాయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతాం ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః తాంబూలం సమర్పయామి

(తాంబూలం చూపాలి)

**నీరాజనం:**

కర్పూర వర్తి సంయుక్తం దీప్యమాన మనోహరం |

ఇదం గృహాణ దేవేశ మంగళం కురు సర్వదా ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః మంగళ నీరాజనం దర్శయామి

(కర్పూరం వెలిగించాలి)

**మంత్రపుష్పం:**

మంత్రపుష్పం ప్రదాస్యామి గృహాణ వరదో భవ |

పరమేశ్వర పుత్రస్త్వం సుప్రీతోభవ సర్వదా ||

భుజంగేశాయ విద్మహే ఉరగేశాయ ధీమహి తన్నో నాగః ప్రచోదయాత్ ||

కార్తికేయాయ విద్మహే వల్లీనాధాయ ధీమహి తన్నో నాగః ప్రచోదయాత్ ||

ఓం తత్పురుషాయ విద్మహే మహాసేవాయ ధీమహీ తన్నో షణ్ముఖి ప్రచోదయాత్ ||

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః మంత్రపుష్పం సమర్పయామి

**ప్రదక్షిణ నమస్కారం:**

(చేతిలో పూలు అక్షితలు తీసుకుని ప్రదక్షిణ చేయాలి)

యానికాని చ పాపాని జన్మాంతర కృతాని చ

తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే

పాపోహం పాపకర్మాహం పాపాత్మ పాపసంభవా

త్రాహి మాం కృపయాదేవి శరణాగతవత్సలే

అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ

తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష జనార్ధన

ఓం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ప్రదక్షిణం సమర్పయామి

**పునః పూజ:**

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ఛత్రం అచ్చాదయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః చామరం వీజయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః నృత్యం దర్శయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః గీతం శ్రావయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః అశ్వాన్ ఆరోహయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః గజాన్ ఆరోహయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః ఆందోళికాం ఆరోహయామి

ఓం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినే నమః సమస్త రాజోపచార దేవోపచార భక్తోపచార శక్త్యోపచార పూజాం సమర్పయామి

**క్షమా ప్రార్థన:**

యస్య స్మృత్యాచ నామోక్త్యా తపః పూజాక్రియాదిషు |

న్యూనం సంపూర్ణతాం యాతి సద్యోవందే తమచ్యుతం ||

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం సురేశ్వర |

యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే ||

**అర్చణ:**

అనయ ధ్యానావాహనాది షోడశోపచార పూజయాచ భగవాన్ సర్వాత్మక |

ఓం సుబ్రహ్మణ్యేశ్వర స్వామీ సుప్రీతస్సుప్రసన్నో వరదో భవతు ||

ఇతి శ్రీ సుబ్రహ్మణ్యా స్వామి షోడశోపచార పూజాం సంపూర్ణం.

సంక్షిప్త సుబ్రహ్మణ్య చరిత్ర - శ్రీ కుమార సంభవం

పరమేశ్వరుడు తపస్సు చేయుచుండగా పూర్వము దేవతలు ఋషులతో గూడి, సేనాపతిని కోరుకొనుచు బ్రహ్మదేవుని కడకు వెళ్ళిరి. ఇంద్రాది దేవతలు అగ్నిని ముందుంచుకొని, బ్రహ్మదేవునకు ప్రణమిల్లి, ఆయనతో ఇట్లు విన్నవించుకొనిరి. "ఓదేవా! పూర్వము మీరు పరమేశ్వరుని మాకు సేనాపతిగా నియమించియుంటిరి. ఆ శంకరుడు ఇప్పుడు పార్వతీదేవితో గూడి హిమవత్పర్వతమున తపమొనరించుచున్నాడు. కర్తవ్య విధానము నెరిగిన ఓ బ్రహ్మదేవా! ఈ (సేనాపతి) విషయమున లోకహితమును గోరి అనంతర కార్యమును గూర్చి ఆలోచిమ్పుడు. ఇప్పుడు మాకు మీరే దిక్కు" .

దేవతల ప్రార్ధనను ఆలకించి, సరలోక సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు మృదుమధుర వచనములతో వారిని ఓదార్చుచు ఇట్లు పలికెను.

"పార్వతీదేవి శాప కారణముగా మీకు మీ పత్నులయందు సంతానము కలుగు అవకాశము లేదు. ఆమె వచనము తిరుగులేనిది. ఇది ముమ్మాటికిని సత్యము.

ఇందు సందేహము లేదు. ఆకాశమున ప్రవహించు ఈ గంగాదేవి యందు అగ్నిదేవుడు ఒక పుత్రుని పొందగలడు. అతడు దేవసేనాపతియై, శత్రు సంహారకుడు కాగలడు. హిమవంతుని పెద్ద కూతురైన గంగ ఆ అగ్నిసుతుని (శివ తేజః ప్రభావమున అగ్నివలన తనయందు జనించిన సుతుని) ఆదరింప గలదు. అతడు పార్వతీదేవికి మిక్కిలి ప్రీతిపాత్రుడగును. ఇందు సంశయము లేదు" .

ఓ రఘునందనా! బ్రహ్మదేవుడు పలికిన ఆ మాటలకు దేవతలందరును సంతసించి, తాము కృతార్థులైనట్లు భావించిరి. అనంతరము వారు బ్రహ్మదేవునకు ప్రణమిల్లి, పూజించిరి. అంతట ఆ దేవతలందరునూ గైరికాదిధాతువులతో విలసిల్లుచున్న కైలాసపర్వతమునకు చేరి, పుత్రోత్పత్తికై అగ్నిదేవుని నియమించిరి. శివతెజమును భరించిన ఓ అగ్నిదేవా! ఈ దేవకార్యమును నెరవేర్పుము. శైలపుత్రికయైన గంగయందు ఆ శివ తేజస్సును ఉంచుము' అని దేవతలు పలికిరి. అగ్నిదేవుడు దేవతలతో 'అట్లే' అని పలికి, గంగాదేవి కడకు వెళ్ళి "ఓ దేవీ! గర్భమును ధరింపుము. ఇది దేవతలకు హితమొనర్చు కార్యము" అని నుడివెను. అప్పుడు గంగ ఆయన మాటలను విని దివ్యమైన స్త్రీ రూపమును ధరించెను. అగ్ని ఆమె సౌందర్యాతిశయమును జూచి, శివతేజమును ఆమెయందంతటను వ్యాపింపజేసెను.

ఓ రఘునందనా! అగ్ని ఆమెపై వ్యాపింపజేసిన శివతేజముతో గంగా ప్రవాహములన్నియును నిండిపోయెను. ఆ అగ్ని తేజస్సుయొక్క తాపమునకు తట్టుకొనలేక గంగాదేవి సర్వ దేవతలకును పురోహితుడైన అగ్నిదేవునితో "క్షణక్షణమునాకును బలీయమగుచున్న నీ తేజస్సును ధరింపలేకయున్నాను"

అని పలికెను. సర్వదేవతల కొరకై సమర్పించెడి ఆహుతులను స్వీకరించునట్టి అగ్నిదేవుడు గంగతో "ఓ దేవీ! ఈ శ్వేత పర్వతప్రదేశమున నీ గర్భమును ఉంచుము' అని యనెను. మహా తేజస్వివైన ఓ పుణ్యపురుషా! రామా! గంగాదేవి అగ్నిదేవుని మాటలను పాటించి, మిక్కిలి తేజోరాశియైన ఆ గర్భమును తన ప్రవాహములనుండి అచట వదలెను. గంగానది గర్భమునుండి వెడలిన తేజస్సు మేలిమి బంగారము వలె కాంతిమంతమై యుండెను. కనుక ఆ తేజస్సు ఉంచబడిన భూమియు, అచటి వస్తువులన్నియును సువర్ణమయములాయెను. ఆ పరిసరములన్నియును రజిత మయములై నిరుపమానమైన కాంతితో వెలుగొందెను. ఆ తేజస్సు యొక్క తీక్ష్ణత్వము వలన రాగి ఇనుము పుట్టెను. ఆ రేతస్సు యొక్క మలము తగరము, సీసము ఆయెను. ఈవిధంగా ఆ తేజస్సు భూమిని జేరి, వివిధ ధాతువులుగా రూపొందెను.

ఆ గర్భము భూమిపై ఉంచబడగానే దాని తేజః ప్రభావముచే ఆశ్వేతపర్వతమూ, అందలి శరవణమూ(రెల్లుగడ్డి) సువర్ణమయములై తేజరిల్లసాగెను. పురుష శ్రేష్ఠుడైన ఓ రాఘవా! అగ్నితో సమానమైన కాంతి గల ఆ బంగారము అప్పటినుండియు 'జాతరూపము' అను పేరుతో ప్రసిద్ధికెక్కెను. అచటి తృణములు, వృక్షములు, లతలు, పొదలు మొదలగునవి అన్నియును స్వర్ణమయములాయెను. తదనంతరము అచట జన్మించిన కుమారునకు పాలిచ్చి పోషించుటకై, ఇంద్రుడు, మరుద్గణములు మొదలగు దేవతలు ఆరుమంది కృత్తికలను నియోగించిరి. "ఈబాలుడు మా అందరి యొక్క పుత్రుడగును" అని ఆ కృత్తికలు దేవతలతో ఒప్పందము చేసుకొనిరి. పిమ్మట ఆ నిశ్చయముతో

అప్పుడే పుట్టిన ఆ శిశువునకు పాలియ్యసాగిరి. అంత దేవతలందరును "ఈ బాలకుడు కార్తికేయుడు అను పేరుతో ముల్లోకముల యందును ఖ్యాతికెక్కును. ఇందు సంశయము లేదు" అని పలికిరి.

గంగాద్వారా అచటికి చేరిన శివతేజస్సు యొక్క ప్రభావమున పుట్టిన ఆ బాలుడు అగ్నివలె వెలుగొందుచుండెను. దేవతలా మాటలను విని, వారి ఆదేశమును అనుసరించి, కృత్తికలు ఆ బాలకునకు స్నానము చేయించిరి. ఓ కాకుత్స్థా! గంగాదేవి గర్భమునుండి స్ఖలితుడైనందున దేవతలు అగ్నితుల్యుడై, కారణజన్ముడైన ఆ మహానుభావుని 'స్కందుడు' అని పిలువసాగిరి. కృత్తికల పోషణ వలన అతనికి 'కార్తికేయుడు' అనియు పేరు ఏర్పడెను. అప్పుడు ఆ ఆరుగురు కృత్తికల స్తనములలో సమృద్ధిగా పాలు ఏర్పడెను. ఆరు ముఖములు గలవాడై ఆ బాలుడు ఆ ఆరుగురి నుండి స్తన్యములను గ్రోలెను. సుకుమార శరీరుడైనను ఆ కుమారస్వామి ఒక దినము మాత్రమే వారినుండి పాలుద్రాగి, మహిమాన్వితుడై అతడు తన పరాక్రమము చేత రాక్షస సైన్యములను జయించెను. దేవతలు అగ్నిదేవుని నాయకత్వమున సాటిలేని తేజస్వియైన ఆ బాలుని కడకు చేరి, అతనిని 'దేవసేనాపతి' గా అభిషేకించిరి.

పవిత్రమైన ఈ గాథను విన్నవారు ధన్యులగుదురు. కుమారస్వామి పై భక్తిగల మానవుడు ఈ లోకమున దీర్ఘాయుష్మంతుడై పుత్రపౌత్రులతో వర్ధిల్లును. తుదకు స్కంద సాలోక్య ఫలమును గూడ పొందును.

ఓం శరవణభవ ఓం శరవణభవ

## కార్తికేయుని 28 నామములు

1. యోగీశ్వరః – యోగీశ్వరులకు అధిపతి

2. మహాసేనః – దేవసైన్యానికి అధిపతి, దేవసేనాపతి

3. కార్తికేయః – ఆరు కృత్తికా నక్షత్రములచే పోషింపబడిన వాడు

4. అగ్నినన్దనః – పరమశివుని జ్ఞానాగ్ని నుంచి ఉద్భవించినవాడు మరియు పరమశివుని తేజస్సు కొంత సేపు భరించినందువల్ల, అగ్ని దేవునికి కూడా తనయుడిగా పిలువబడినవాడు.

5. స్కందః – పరమశివుని తేజస్సు నుండి జన్మించినవాడు

6. కుమారః – కుమార అన్న నామం కేవలం సుబ్రహ్మణ్యునికేచెందినది. ఎందుకంటే, జగత్తుకి మాతా పితలు అయిన పార్వతీ పరమేశ్వరుల అన్యోన్యతకి ఫలం మన బుజ్జి సుబ్రహ్మణ్యుడు.

7. సేనానీః – దేవసేనలకు అధిపతి, దేవసేనాధ్యక్షుడు.

8. స్వామీ శంకరసంభవః – శంకరుని దివ్యమైన తేజస్సు నుండి పుట్టినవాడు.

9. గాంగేయః – పరమశివుని తేజస్సు అగ్నిదేవుడు భరించలేక, గంగా మాతకి ఇచ్చేస్తే, గంగా మాత కొంత సేపు శివుని తేజస్సును భరిస్తుంది. అందువల్ల, గంగా మాతకి కూడా పుత్రునిగా పిలబడ్డవాడు కాబట్టి గాంగేయ అనే నామం వచ్చింది.

10. తామ్రచూడః – కుక్కుటమును అధిరోహించిన వాడు.

11. బ్రహ్మచారీ – ఎల్లప్పుడూ బ్రహ్మనందు రమించువాడు.

12. శిఖిధ్వజః – అగ్ని ధ్వజముగా కలవాడు

13. తారకారిః – తారకాసురడనే రాక్షస సంహారము చేయుటకు అవతారం దాల్చిన వాడు, తారకాసురుడిని, ఇతర రాక్షస గణములను సంహరించి దేవతలను రక్షించినవాడు.

14. ఉమాపుత్రః – ఉమాదేవి, అంటే పార్వతీ అమ్మ వారి ముద్దుల తనయుడు. అందుకే సుబ్రహ్మణ్య స్వామి వారు అచ్చం అమ్మవారి లానే ఉంటారు.

15. క్రౌంచారిః – పర్వత రూపములో ఉన్న క్రౌంచ అనే రాక్షసుడిని సంహరించినవాడు.

16. షడాననః – ఆరు ముఖములు గలవాడు.

17. శబ్దబ్రహ్మసముద్రః – జ్ఞాన స్వరూపుడు, అంటే వేదములు ఏ పరబ్రహ్మ స్వరూపమును గురించి ఘోషిస్తున్నాయో, ఆ వేద శబ్దములచే ప్రతిపాదించబడిన వాడు.

18. సిద్ధః – పరిపూర్ణ సిద్ధ స్వరూపుడు

19. సారస్వతః – సరస్వతీ స్వరూపము, అంటే జ్ఞాన స్వరూపము.

20. గుహః – సకలజీవుల హృదయ గుహలో కొలువై ఉన్నవాడు.

21. భగవాన్ సనత్కుమారః – చతుర్ముఖ బ్రహ్మ గారి నలుగురు మానస పుత్రులలో ఒకరైన సనత్కుమారుడే సుబ్రహ్మణ్యుడిగావచ్చారు. ఈ విషయమే, శ్రీవిద్యా రహస్యంలో మాహాత్మ్యఖండంలో వివరించబడినదని, శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారు నిర్ధారించారు.

22. భోగమోక్షఫలప్రదః – ఈ భూమి మీద మనం సుఖంగా జీవించడానికి అవసరమైన సంపదతో పాటు అంత్యమునందు మోక్షమును కూడా ఇవ్వగలిగినవాడు.

23. శరజన్మా – శరవణతటాకము (రెల్లు పొదల) నుండి జన్మించినవాడు.

24. గణాధీశః – సకల దేవతలకు, గణములకు అధిపతి అయిన వాడు.

25. పూర్వజః – అందరికన్నా ముందున్నవాడు, అంటే ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామి వారు, కేవలం ఒక అవతారం మాత్రమే కాదు, ఎప్పుడూ ఉండే పరబ్రహ్మ స్వరూపం. ఆయన ఎప్పుడూఉన్నవాడు, పుట్టుక లేనివాడు.

26. ముక్తిమార్గకృత్ – ముక్తి మార్గమును బోధించే గురు స్వరూపం. అంత్యమున ముక్తిని ప్రసాదించి, తనలో కలుపుకునే స్వామి.

27. సర్వాగమప్రణేతా – సకల ఆగమములకు మూలము.

28. వాంచితార్థప్రదర్శనః – అభీష్టములను నెరవేర్చే తండ్రి.

స్కంద ఉవాచ-

**ఈ ప్రజ్ఞావివర్ధన కార్తికేయ స్తోత్రము రుద్రయమల తంత్రములోనిది. ఎవరైతే ఈ 28 నామములు ప్రతీ దినం ప్రాతః కాలం భక్తి శ్రద్ధలతో చదువుతారో, వారు సరస్వతీ అనుగ్రహం పొంది, చక్కని తెలివితేటలు, మంచి వాక్కు మరియు  జ్ఞానమును పొందుతారు.**

**సర్వం శ్రీవల్లీదేవసేనాసమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరార్పణమస్తు**